సాక్షి
వికారాబాద్

శనివారం । 14 । జూన్ । 2025



మానవ మృగాళ్లు!

మద్యం, గంజాయి మత్తులో వృద్ధులు, ఒంటరి మహిళలే లక్ష్యంగా కామాంధులు తెగబడుతున్నారు.

8లో ▸



చదువుతోనే భవిష్యత్

చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఉత్తమ్‌చంద్ అన్నారు.

8లో ▸



ప్రభుత్వ పాఠశాలల్లోనే..

ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని మండల విద్యాధికారి మల్లేశం తల్లిదండ్రులకు సూచించారు.

9లో ▸

న్యూస్‌రీల్

చిన్నారులకు అక్షరాభ్యాసం



పిల్లలతో అక్షరాలు దిద్దిస్తున్న ఎంఈఓ రాంరెడ్డి

కొడంగల్: పట్టణంలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు ఎంఈఓ రాంరెడ్డి శుక్రవారం అక్షరాభ్యాసం చేయించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఆయన పాఠశాలను సందర్శించారు. స్కూల్‌లో కొత్తగా చేరిన చిన్నారులతో ఆయన అక్షరాలు దిద్దించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు వివరించారు. ఉదయం పూట అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, తాగునీరు, పుస్తకాలు, దుస్తులు ఉచితంగా ఇస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోధ్యాయుడు అబ్దుల్ హక్, ఉపాధ్యాయులు సుహాసిని, అంగన్వాడీ టీచర్లు యాదమ్మ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరిస్తాం

ఆర్డీవో వాసుచంద్ర



దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్డీవో వాసుచంద్ర

నవాబుపేట: రెవెన్యూ సదస్సుల్లో రైతులు ఇచ్చే దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, భూ సమస్యలను పరిష్కరిస్తామని వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర తెలిపారు. శుక్రవారం మండలంలోని మాదిరెడ్డిపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న మాట్లాడారు. భూ సమస్యలు ఉన్న రైతులు రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వాటిని అధికారులు తక్షణం పరిష్కరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ బుచ్చయ్య., ఆర్‌ఐ రజిత, మాజీ సర్పంచ్ ప్రభాకర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి గడ్డం వివేక్‌ను కలిసిన నారెగూడ వాసులు



మంత్రిని సన్మానించి శుభాకాంక్షలు తెలుపుతున్న నారెగూడ ప్రజలు

నవాబుపేట: రాష్ట్ర మైనింగ్, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని మండలంలోని నారెగూడ ప్రజలు శుక్రవారం నగరంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ సర్పంచ్ పర్మయ్య, గ్రామస్తులు కిష్టయ్య, వెంకట్, దేవ్ కుమార్, శివకుమార్, ఈశ్వర్, భీమ్‌రావు మంత్రికి పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాల సామాజిక వర్గానికి చెందిన వివేక్‌కు మంత్రి పదవి దక్కడం ఆనందంగా ఉందన్నారు. మాలల సంక్షేమానికి కృషి చేయాలని మంత్రిని కోరినట్లు వారు తెలిపారు.

పెంచిన బస్ పాస్ చార్జీలు తగ్గించాలి

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రాజుకుమార్



బస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

అనంతగిరి: పెంచిన బస్ పాస్ చార్జీలను వెంటనే తగ్గించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రాజుకుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం వికారాబాద్ బస్టాండ్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బస్ పాస్ చార్జీలు 20 శాతం పెంచడం సరికాదన్నారు. జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుంచి చదువుకోడానికి పేద విద్యార్థులు మండలాలు, జిల్లా కేంద్రానికి వస్తుంటారని చార్జీల పెంపుతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే బస్ పాస్ చార్జీలను తగ్గించాలని కోరారు. విద్యార్థులందరికీ ఉచిత బస్ పాసులు అందించాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున్న ఉద్యమాలు చేస్తామని హెచ్చరిస్తున్నాం. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు తేజ, నాయకులు రెహాన్, సిద్దు, అభిషేక్, ఇస్మాయిల్ పాల్గొన్నారు..



సాయమేదీ..?

- వానాకాలం ప్రారంభమైనా అన్నదాతకు అందని పంట రుణం, రైతు భరోసా పథకం
- జిల్లాకు అందాల్సిన పంట పెట్టుబడి సాయం రూ.320 కోట్లు
- రుణ ప్రణాళిక ఖరారు చేయని బ్యాంకర్లు
- రైతుల సంఖ్య 2.5లక్షలు
- సాగు విస్తీర్ణం 5.90లక్షల ఎకరాలు

వికారాబాద్: పంట రుణం లేదు.. రైతు భరోసా ఊసే కనిపించడం లేదు.. ఇదీ ఈ ఏడాది జిల్లా రైతుల పరిస్థితి.. వానాకాలం సీజన్ ప్రారంభమై 15రోజులు దాటినా బ్యాంకర్లు పంట రుణాల మాటే ఎత్తడం లేదు. ప్రభుత్వం రైతు భరోసా ఎప్పుడు అమలు చేస్తుందో స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో పంట పెట్టుబడి కోసం అన్నదాతలు మళ్లీ వడ్డీ వ్యాపారుల గడప తొక్కని పరిస్థితి నెలకొంది. బ్యాంకర్లు పంట రుణాలిస్తారా..? ఇవ్వరా అనే అనుమానంలో రైతులు ఉన్నారు. ఎకరా సాగుకు రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు వస్తుంది.. దీంతో రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలకు అప్పులు చేస్తున్నారు. నేటికీ బ్యాంకర్లు రుణ ప్రణాళిక విడుదల చేయకపోవడం గమనార్హం.

రుణ లక్ష్యం రూ.3,829 కోట్లు

సాధారణంగా వానాకాలం సీజన్ ప్రారంభానికి ముందే బ్యాంకర్లు జిల్లాలో ఎంత మంది రైతులు ఉన్నారు..? ఎన్ని ఎకరాల సాగుభూమి ఉంది..? ఇవ్వాల్సిన రుణాలు ఎన్ని అనే దానిపై రుణ ప్రణాళిక సిద్ధం చేస్తారు. గతేదాది రూ.3,829 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా 60 శాతానికి మించి ఇవ్వలేదు. ఈ ఏడాది ఇంత వరకు రుణ ప్రణాళికే ప్రకటించలేదు. జిల్లాలో 2.5 లక్షల మంది రైతులు ఉండగా వారికి ఎంత మేర రుణాలు ఇవ్వాలి అనే వివరాలే తేల్చలేదు. రైతులు ఎరువులు, విత్తనాల కొనుగోలు చేయడం ప్రారంభించి 15 రోజులు కావస్తున్నా బ్యాంకర్లు రుణాలు ఇచ్చే ప్రయత్నం చేయడం లేదు. కొన్ని బ్యాంకులు రుణ ప్రక్రియను ప్రారంభించినా కొర్రీలు పెడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. వివిధ కారణాల వల్ల గత ఏడాది చాలా మంది రైతులకు రుణమాఫీ అమలు కాలేదు.

5.90లక్షల ఎకరాల్లో..

ప్రస్తుత సీజన్‌లో 5.90లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఆయా పంట రకాలను బట్టి ఒక్కో ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడి అవసరం అవుతుంది. ఈ లెక్కన ఏటా జిల్లాలోని ఎస్‌బీఐ, తెలంగాణ గ్రామీణ బ్యాంక్, ఆంధ్రా బ్యాంకుతోపాటు డీసీసీబీ సగటున రూ.3,500 కోట్ల నుంచి రూ.3,800 కోట్ల వరకు వ్యవసాయ రుణాలు ఇస్తాయి. జిల్లాకు రైతు భరోసా కింద రూ.320 కోట్లు రావాల్సి ఉంది. నేటీ అన్నదాతల ఖాతాల్లో డబ్బు జమ కాలేదు.

రుణాలు ఇవ్వాలి



ఏటా వానాకాలం సీజనం ప్రారంభం కాగానే బ్యాంకర్లు రుణాలు ఇచ్చేవారు. ఈ సారి క్రాప్ లోన్లు ఇవ్వడం లేదు. బ్యాంకులకు వెళ్లి అడిగినా సరైన సమాధనం చెప్పడం లేదు. ప్రభుత్వం కూడా రైతు భరోసా పథకం అమలు చేయాలేదు. ప్రభుత్వం, బ్యాంకర్లు వెంటను పంట పట్టుబడి సాయం అందించి ఆదుకోవాలి.

– కాశయ్య, రైతు, మల్లెపల్లి



రెవెన్యూ సదస్సులో భూ సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

భూ భారతితో సత్వర పరిష్కారం

- ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: భూ సమస్యలను సాధ్యమైనంత వరకు రెవెన్యూ సదస్సులోనే పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. శుక్రవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని ఎన్నేపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సును ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భూ సమస్యల సత్వర పరిష్కారం కోసమే ప్రభుత్వం కొత్త చట్టాన్ని అందుబాటులోకి తెచ్చిందని పేర్కొన్నారు. భూ భారతిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తుచేస్తున్నారా? అని ఆరా తీశారు. వివరాల నమోదులో ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం ఇవ్వరాదని సూచించారు. స్వీకరించిన దరఖాస్తులకు రశీదులు ఇవ్వాలన్నారు. అలాగే రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలని ఆదేశించారు. సమస్యల వారీగా అర్జీలను విభజించి పక్కాగా నమోదు చేయాలని తెలిపారు. మండల స్థాయిలో పరిష్కరించగల సమస్యలను తహసీల్దార్ చూసుకోవాలన్నారు. అర్జీలు ఇచ్చేవారితో సున్నితంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గౌరవప్రదమైన జీవితాన్ని ఇద్దాం

వైకల్యం ఉన్న వారిని గుర్తించి శస్త్ర చికిత్సలు చేయిస్తే వారికి గౌరవప్రదమైన జీవితాన్ని ఇచ్చిన వారమవుతామని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో ఆకర్ ఆశ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వికారాబాద్, పూడూరు మండలాలకు చెందిన వైద్యాధికారులు, ఐసీడీఎస్ సీడీపీఓలు, సూపర్ వైజర్లు, ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లకు వైకల్య పరీక్షలు నిర్వహించడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పుట్టుకతోనే కాకుండా ఇతరత్రా కారణాల వల్ల వైకల్యం పొందిన వారిని గుర్తించి శస్త్ర చికిత్సలు చేయించేందుకు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఇలా చేయడం ద్వారా మన బాధ్యతగా భావించాలన్నారు. శస్త్ర చికిత్సల సమయంలో ఉచిత భోజన, రవాణా సౌకర్యం కల్పించడం జరుగుతుందని తెలిపారు. చికిత్సలు చేసేందుకు వీలుగా గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. వైకల్యం ఉన్నవారికి శస్త్ర చికిత్సల తోపాటు ప్లాస్టిక్ సర్జరీలు కూడా ఉచితంగా చేస్తామని చెప్పడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరవణ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రవీణ్, వైద్యాధికారులు శాలిని, నిఖిల్, మహమ్మద్, సౌమ్య, కృప, దేవిక తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే టీఆర్ఆర్

సుభిక్షం.. ఇందిరమ్మ రాజ్యం

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: రాష్ట్ర ప్రజలు మళ్లీ ఇందిరమ్మ రాజ్యాన్ని చూస్తున్నారని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలంలోని ఆయా గ్రామాలకు చెంది లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క ఇల్లు కూడా కట్టలేదన్నారు. కాంగ్రెస్ హయాంలో కట్టిన ఇళ్లే నేటికీ కనిపిస్తున్నాయని వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. త్వరలో రెండో విడత మంజూరు కార్యక్రమం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను నెరవేరుస్తాం

పూడూరు: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసి తీరుతుందని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పూడూరులో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన పేదలందరికీ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గానికి ఏడాదికి 3,500 చొప్పున ఇళ్లు మంజూరవుతాయని వివరించారు. పేదలకు ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం ఇస్తున్న ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది కాంగ్రెస్సే అన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పట్లోళ్ల సతీష్‌రెడ్డి, ఎంపీడీఓ పాండు, పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, డీసీసీ ఉపాధ్యక్షుడు పట్లోళ్ల రఘునాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వేశారు.. డ్రైన్ మరిచారు

- వీధుల్లో నిలుస్తున్న మురుగు
- ప్రమాదాల బారిన చిన్నారులు

తాండూరు టౌన్: పట్టణంలోని పలు వార్డుల్లో సీసీ రోడ్లు వేసిన అధికారులు మురుగు కాల్వల నిర్మాణాన్ని మరిచారు. దీంతో మురుగు నీరు జనావాసాల మధ్య నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. పట్టణంలోని సాయిపూర్‌లోని రక్షమైసమ్మ ఆలయం నుంచి గంగోత్రి విద్యాలయం వెనుక వరకు వేసిన సీసీ రోడ్డుకు ఇరువైపులా మురుగు నిలిచింది. చిన్నారులు ఆడుకుంటూ వెళ్లి మురుగునీటిలో పడి గాయాలపాలవుతున్నారు. సాధారణంగా సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టినప్పుడు దానికి సమాంతరంగా మురుగు నిర్మాణం చేపడుతుంటారు. అలా చేసినప్పుడే ఆయా వార్డుల్లో వరద, మురుగు నీరు చేరకుండా ఉంటుంది. కానీ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. దీంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు స్పందించి ఆయా మార్గాల్లో మురుగు కాల్వల నిర్మాణం చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



మురుగు కాలువకు నోచుకోని కాలనీ

బోధనలో నిర్లక్ష్యాన్ని సహించం

- డీఈఓ రేణుకాదేవి
- మోత్కూర్ పాఠశాలలో చిన్నారులతో అక్షరాభ్యాసం

దోమ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన బోధన చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని మోత్కూర్ పాఠశాలను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థికీ మెరుగైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. నిత్యం డిజిటల్ బోధన, ఏఐ తరగతులు నిర్వహించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించాలని ఆదేశించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించి మంచి ఫలితాలు రాబట్టాలన్నారు. అనంతరం చదువుల తల్లి సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు చేసి చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో జిల్లా ఏఎంఓ రామ్‌మస్తాన్, సీఎంఓ రజని, ఎంఈఓ వెంకట్, ఏఏపీసీ చైర్మన్లు రేణమ్మ, సుజాత, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాండు, జిల్లా పరిషత్ ఇన్‌చార్జి హెచ్‌ఎం బాల్‌రాజు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అనసుజ, పీఏసీఎస్ డైరెక్టర్లు మల్లేశం, శ్రీనివాస్, అంగన్వాడీ టీచర్లు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.



మోత్కూర్ పాఠశాలను సందర్శించిన డీఈఓ రేణుకాదేవి

రోడ్లు జలమయం

దుద్యాల్: మండలంలోని కుదురుమల్ల గ్రామంలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయంగా మారాయి. దీంతో గ్రామంలోకి రాకపోకలు సాగించడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కింది గేరి కాలనీలోకి వెళ్లే రోడ్డులో భారీగా వర్షపు నీరు నిలిచింది. ఆ నీటిలోనే ఇళ్లకు వెళ్లాల్సి వస్తోందని కాలనీ వాసులు తెలిపారు.



నీటిలో నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్న కింది గేరి కాలనీ వాసులు

పేదల సంక్షేమమే లక్ష్యం

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

యాలాల: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. మొదటి విడతలో ఇళ్ల మంజూరు కాని వారు నిరాశ చెందరాదని రెండో విడతలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం 408మందికి ఇళ్ల మంజూరు పత్రాలు అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు రమేష్, సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, బీ బ్లాక్ అధ్యక్షుడు అనిల్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, మాజీ అధ్యక్షుడు భీమప్ప, ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు సంపత్‌కుమార్, పేరి రాజేందర్‌రెడ్డి, అమృతయ్య, హన్మంతు, మహిపాల్ పాల్గొన్నారు.

ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

మండల కేంద్రంలోని నౌషా బాలేసాబ్ దర్గా ఉర్సు ఉత్సవాల్లో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను మైనార్టీ నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో కోఆప్షన్ మాజీ సభ్యుడు అక్బర్‌బాబా, ఉత్సవ కమిటీ సభ్యులు గంతల మైనొద్దీన్, అక్రం, అహ్మద్, జలీల్, గఫార్, మౌలాన, రజాక్ తదితరులు పాల్గొన్నారు.



దర్గాలో ప్రార్థన చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తదితరులు


వన మహోత్సవాన్ని విజయవంతం చేద్దాం

తాండూరు: పట్టణంలో శుక్రవారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి విస్తృతంగా పర్యటించారు. పాత తాండూరులోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో చిన్నారుల అక్షరాభ్యాసం కార్యక్రమంలో పాల్గొన్నారు. గొల్ల చెరువు మినీ ట్యాంక్ బండ్‌పై మెప్మా ఆధ్వర్యంలో చేపట్టిన వన మహోత్సవంలో పాల్గొన్నారు. కట్టపై ఉన్న అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డితో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు హబీబ్ లాల, మాజీ కౌన్సిలర్లు పట్లోళ్ల నర్సింహులు, ప్రభాకర్‌గౌడ్, నీరజా బాల్‌రెడ్డి, బాంబినా, రామకృష్ణ, నాయకులు అబ్దుల్ రవూఫ్, సర్దార్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలతో సమూల మార్పులు

- ఎస్పీ నారాయణరెడ్డి
- ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమంలో పోలీసు అధికారులు

అనంతగిరి: నూతన చట్టాలపై పోలీసు అధికారులకు సంపూర్ణ అవగాహన ఉండాలని ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. శుక్రవారం జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో జరిగిన భారతీయ న్యాయ సంహితలో కొత్త చేర్పులపై సున్నితత్వం అనే అంశంపై జిల్లా పోలీసులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆన్‌లైన్‌లో ఏర్పాటు చేసిన ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్తగా ప్రవేశపెట్టిన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య అధునీయం చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. ఈ చట్టాలు దేశంలో నేర, న్యాయ వ్యవస్థలో సమూల మార్పులను తీసుకవస్తాయన్నారు. వీటిని సమర్థవంతంగా అమలు చేయడానికి అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. కొత్త చట్టాలతో శిక్షించడమే కాదు, బాధితులకు సత్వర న్యాయం అందించడం కూడా అన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేర విచారణ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు, ఎస్‌ఐలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి, పోలీసు అధికారులు

ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలి

కుల్కచర్ల: పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా మెలగాలని ఎస్పీ నారాయణరెడ్డి సిబ్బందికి సూచించారు. శుక్రవారం కుల్కచర్ల పోలీస్ స్టేషన్ను పరిగి డీఎస్పీ శ్రీనివాస్‌తో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలు, సిబ్బంది భవనాలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు చేసిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో నమోదు చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఇసుక, గంజాయి, డ్రగ్స్, గుట్కా వంటి మత్తుపదార్థాల విక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. విధి నిర్వహణలో ప్రతి ఉద్యోగి బాధ్యతతో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రమేశ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు లోక్ అదాలత్

దౌల్తాబాద్: రాజీ మార్గమే రాజ మార్గమని ఎస్ఐ రవిగౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజలు శనివారం నిర్వహించే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కొట్టుకున్న కేసు, దొంగతనాలు, భార్యభర్తల గొడవలు, యాక్సిడెంట్లు, చీటింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ వంటి కేసులను లోక్‌అదాలత్‌లో రాజీ కుదుర్చుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు రక్తదాన శిబిరం

తాండూరు: పట్టణంలోని బాలాజీ హాస్పిటల్‌లో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ సంపత్‌కుమార్ తెలిపారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు రక్తదాన శిబిరం కొనసాగుతుందని తెలిపారు. యువత ఈ కార్యక్రమంలో పాల్గొని రక్తదానం చేయాలని ఆయన కోరారు.

161సార్లు రక్తదానం

పట్టణంలోని బాలాజీ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ సంపత్‌కుమార్ ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడంలో ముందు వరుసలో ఉంటారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులకు పలు మార్లు రక్తం ఇచ్చారు. ఐదు పదుల వయస్సు దాటినా రక్తదానం చేస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇప్పటి వరకు 161సార్లు రక్తదానం చేసి రికార్డు సృష్టించారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దు వద్ద రైతు చంద్రయ్య

దోమ: మేత కోసం వెళ్లిన ఓ ఎద్దు విద్యుత్ షాక్‌తో మృత్యువాత పడింది. ఈ ఘటన దోమ మండల పరిధిలోని బొంపల్లి గ్రామంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు, బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన అప్పగాళ్ల చంద్రయ్య వ్యవసాయ పనుల నిమిత్తం రెండు ఎద్దులను కొనుగోలు చేసి జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే పొలానికి తీసుకెళ్లి ఎద్దులను మేత కోసం వదిలాడు. అక్కడ పొలం దగ్గర ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేసుకుంటూ వెళ్లి ఓ ఎద్దుకు ఎర్త్‌వైర్ తాకి అక్కడికక్కడే మృత్యువాత పడింది. దీన్ని గమనించిన బాధిత రైతు లబోదిబోమంటూ బోరున విలపించాడు. చుట్టు ప్రక్కల రైతులు అక్కడికి చేరుకొని ట్రాన్స్‌ఫార్మర్ బంద్ చేసినప్పటికి అప్పటికే ఎద్దు మృతి చెందిందని తెలిపారు. ఎద్దు విలువ సుమారు రూ.90 వేలు ఉంటుందని బాధిత రైతు కన్నీటిపర్యాంతమయ్యాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



నర్సింహులు

పరిగి: రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణ కేంద్రంలోని సయ్యాద్‌మల్కాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన ప్యాట నర్సింహులు (30) గురువారం అర్ధరాత్రి 11గంటల సమయంలో గ్రామ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో నర్సింహులు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి అన్న జంగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సర్టిఫికెట్ల కోసం వెళ్లిన యువతి అదృశ్యం

ఇబ్రహీంపట్నం రూరల్: పాలిటెక్నిక్ కళాశాల నుంచి సర్టిఫికెట్లు తెచ్చుకునేందుకు వెళ్లిన యువతి అదృశ్యమైంది. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. కుర్మల్‌గూడ పరిధి ఇంద్రానగర్ కాలనీకి చెందిన కొడవళ్లూరి జయదుర్గా పురందేశ్వరి ఈ నెల 12న ఉదయం 10గంటల ప్రాంతంలో మీర్‌పేట్‌లోని కళాశాలకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

మానవ మృగాళ్లు!



వృద్ధులు, ఒంటరి మహిళలే లక్ష్యంగా కామాంధులు తెగబడుతున్నారు. మద్యం, గంజాయి మత్తులో విచక్షణ కోల్పోయి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. కామంతో కళ్లు మూసుకుపోయి రాక్షసుల్లా వ్యవహరిస్తున్నారు.

- వృద్ధులు, ఒంటరి మహిళలే టార్గెట్
- మద్యం, గంజాయి మత్తులో అఘాయిత్యాలు
- యాచారం మండలంలో సమాజం నివ్వెరపోయే ఘటనలు

యాచారం: తొంభై ఏళ్ల పండు వృద్ధురాలిపై మండలంలో వెలుగు చూసిన లైంగిక దాడి ఘటన ప్రతిఒక్కరినీ నివ్వెరపోయేలా చేసింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఇంట్లో ఒంటరిగా ఉంటున్న వారితో పాటు వారి కుటుంబ సభ్యుల్లోనూ ఆందోళన నెలకొంది. ఏ గ్రామంలో చూసినా మద్యం ఏరులై పారుతోంది. దీనిపై ఇటు ఎక్సైజ్, అటు పోలీసు శాఖలు పూర్తిగా చేతులెత్తేశాయనే ఆరోపణలున్నాయి. యాభై ఇళ్లు కూడా లేని పల్లెల్లో సైతం పదుల సంఖ్యలో బెల్టు షాపులు నడుస్తున్నాయి. గత బుధవారం వృద్ధురాలిపై అఘాయిత్యం జరిగిన గ్రామంలో కూడా కొంతమంది యువకులు అర్ధరాత్రి వరకూ మద్యం మత్తులోనే ఉంటారని, ఊరిలో విచ్చల విడిగా తిరుగుతుంటారని విచారణ కోసం వచ్చిన పోలీసులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఇలాంటి వారిపై సమాచారం ఇస్తే ఎక్కడ తమపై దాడి చేస్తారనే భయంతో మిన్నకుండిపోతున్నామని తెలిపారు. మండలంలోని మాల్, నల్లవెల్లి, మంతన్‌గౌరెల్లి, కొత్తపల్లి, యాచారం, నక్కర్తమేడిపల్లి, కుర్మిద్ద, తాడిపర్తి, నందివనపర్తి, చింతుల్ల, గునుగల్, గడ్డమల్లయ్యగూడ తదితర గ్రామాల్లో ఈ వాతావరణం ఎక్కువగా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మాల్ ఘటన మరవకముందే..

నాగార్జునసాగర్– హైదరాబాద్ రహదారి పక్కన ఉండే మాల్ మండల కేంద్రంలోని ఓ దుకాణం ఎదుట నిద్రిస్తున్న 70 ఏళ్ల వృద్ధురాలిపై లైంగిక దాడి జరిగింది. సీసీ పుటేజీల ఆధారంగా ఈ అఘాయిత్యానికి పాల్పడిన యువకుడిని పట్టుకున్న పోలీసులు అతన్ని జైలుకు పంపించారు. గత ఫిబ్రవరిలో చోటుచేసుకున్న ఈ ఘటనను మరవకముందే మరో దాడి జరగడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికైనా పోలీసు శాఖ అధికారులు స్పందించి గ్రామాల్లో మద్యం, గంజాయి విక్రయాలపై కఠినంగా వ్యవహరించాలని, రాత్రివేళ పెట్రోలింగ్ ముమ్మరం చేసి, ప్రజల మానప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

పోలీసులదే బాధ్యత



వృద్ధులు, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న వారికి కఠిన శిక్షలు పడేలా చూడాల్సిన బాధ్యత పోలీసుపై ఉంది. గ్రామాల్లో విచ్చలవిడి మద్యం అమ్మకాలను అరికట్టాలి. గంజాయి విక్రయించే, సేవించే వారిపై ప్రత్యేక దృష్టిసారించాలి. ప్రజలకు అన్ని విధాలుగా రక్షణ కల్పించాలి.
– మల్‌రెడ్డి రంగారెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే

సైకో పనేనా..?

మండలంలో వృద్ధురాలిపై లైంగిక దాడికి పాల్పడింది ఓ సైకో కావచ్చని పోలీసులు భావిస్తున్నారు. మద్యానికి బానిసైన కామాంధుడే ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటాడని తెలుస్తోంది. ఈ ఘటనలో ఒక్కడే ఉన్నాడా..? ఇంకెవరికైనా సంబంధం ఉందా..? అనే దిశగా పోలీసులు విచారణ చేస్తున్నారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి ఈ కేసును చాలెంజ్‌గా తీసుకున్నారు. బాధిత వృద్ధురాలి వద్దకు తరచూ ఎవరెవరు వెళ్లేవారు..? గతంలో డబ్బుల కోసం ఆమెను బెదిరించింది ఎవరు..? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వృద్ధురాలి ఛాతిపై బలంగా దాడి చేయడంతో పాటు గొంతు నులమడంతో స్పృహ కోల్పోయింది. దీంతో చనిపోయిందని భావించిన దుండగుడు అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. ఇదిలా ఉండగా గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలికి రక్తస్రావం తగ్గకపోవడంతో శుక్రవారం ఆపరేషన్ నిర్వహించినట్లు తెలిసింది. ఆతర్వాత స్పృహలోకి వచ్చిన ఆమె కుటుంబ సభ్యులకు పలు విషయాలు చెప్పినట్లు సమాచారం. ఈ ఆధారాలతో నిందితుడిని గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. కామాంధుడిని పట్టుకుని, సరైన శిక్ష పడేలా చూస్తామని సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు.

మధ్యాహ్న భోజన పథకంలో రగడ

- నిబంధనల ప్రకారమే నిర్వాహకుల ఏర్పాటు: హెచ్‌ఎం
- మహిళా సంఘం నాయకుల జోక్యంతో సమస్య పరిష్కారం



హెచ్‌ఎంతో మాట్లాడుతున్న గ్రామ సంఘం మహిళలు

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకానికి పాత, కొత్త ఏజెన్సీ నిర్వాహకుల మధ్య జరిగిన రగడ గ్రామ సంఘం మహిళా నాయకులు, స్థానికులు సమస్య పరిష్కరించారు. అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రతీ ఏడాది మధ్యాహ్న భోజన పథకానికిగాను ఏజెన్సీ నిర్వాహకుల కోసం ఏడాదికోసారి గ్రామ మహిళా ఐక్యసంఘం వారు తీర్మానించిన వారినే ఏర్పాటు చేస్తారు. ఈ ఏడాది కూడా అలాగే చేశారు. కానీ పాత నిర్వాహకులు ఒప్పుకోకపోవడంతో వివాదం మొదలైంది. తాము నిర్వహిస్తామంటే..తాము రెండు రోజులుగా వివాదం కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలో పాఠశాల ప్రారంభమైన రెండు రోజులు కూడా పక్క పాఠశాల నిర్వాహకులతో వడ్డించి విద్యార్థులకు పెట్టారు. చివరకు ఈ సమస్య పెద్దగా కావడంతో శుక్రవారం స్థానిక మహిళా సమాఖ్య నాయకులు ఐకేపీ వీఓఏలు కలిసి హెచ్‌ఎం శ్రీహరిరెడ్డిని కలిసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సంఘం తీర్మానించిన వారిని ఏర్పాటు చేయాలని అలాగే ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా కృషి చేయాలని కోరారు. ఇందుకు హెచ్‌ఎం మాట్లాడుతూ ఇలాంటి సమస్యకు ముందుకు వస్తారేకానీ పిల్లలను ప్రభుత్వ బడిలో చేరేవిధంగా, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామ సంఘం తీర్మానం మేరకు ఏజెన్సీ ఏర్పాటు చేయిస్తామని హెచ్‌ఎం హామీ ఇవ్వడంతో మహిళా సంఘం నాయకులు వెనుదిరిగారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఉత్తమ్‌చంద్



జినుగుర్తి పాఠశాలలో విద్యార్థులతో అక్షరాభాస్యం చేయిస్తున్న ఉత్తమ్‌చంద్

తాండూరు రూరల్: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఉత్తమ్‌చంద్ అన్నారు. శుక్రవారం మండలంలోని జినుగుర్తి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాఠశాలలను బలోపేతం చేస్తోందన్నారు. తల్లిదండ్రులు పిల్లలను సర్కారు బడుల్లోనే చేర్పించాలని సూచించారు. పెద్దపెద్ద ఉద్యోగాలు సాధించిన వారు ప్రభుత్వ బడుల్లోనే చదువుకున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మృత్యుంజయ స్వామి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నాగప్ప, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, నర్సింలు మాదిగ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీసీలు అన్ని రంగాల్లో రాణించాలి

బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ



నియామకపత్రం అందజేస్తున్న బర్క కృష్ణ

నందిగామ: బీసీలు అన్ని రంగాల్లో రాణించాలని బీసీ సేనా జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అప్పారెడ్డిగూడలో బీసీ సేనా మహిళా కమిటీ నియామక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీసీ సేనా జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ హాజరయ్యారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు గ్రామ స్థాయి నుంచి కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. బీసీలంతా ఏకమై హక్కుల కోసం పాటుపడాలని సూచించారు. గ్రామ కమిటీ అధ్యక్షురాలిగా గౌతమి, ఉపాధ్యక్షురాలిగా నిర్మలమ్మ, ప్రధాన కార్యదర్శిగా సరిత, కార్యదర్శిగా భాగ్యలక్ష్మి, కోశాధికారిగా సంగీతను ఎన్నుకుని నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సేనా జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, జిల్లా కన్వీనర్ శ్రీనివాస్, నియోజకవర్గ అధ్యక్షుడు చంద్రశేఖరప్ప, మహిళా కమిటీ అధ్యక్షురాలు వరలక్ష్మి, మండల అధ్యక్షురాలు జ్యోతి అసెంబ్లీ కార్యదర్శి శారద, నాయకులుసదర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో అక్షరాభ్యాసం



దౌల్తాబాద్: బాలంపేటలో అక్షరాభ్యాసం చేయిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



పరిగి: రాపోల్‌లో అంగన్‌వాడీలో చిన్నారులతో సీడీపీఓ మెహరున్నీసా బేగం



ధారూరు: అన్నపూర్ణ ఆలయంలో అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు

దౌల్తాబాద్: అంగన్‌వాడీ కేంద్రాల్లో అమ్మ బాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బాలంపేట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల మాట్లాడుతూ చిన్న పిల్లలకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు రాజు, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయంలో..

ధారూరు: మండల కేంద్రంలోని శ్రీవీరభద్రేశ్వర స్వామి దేవాలయంలోని అన్నపూర్ణ మాత సమీపంలో అక్షరాభ్యాసం చేయించారు. పాఠశాలలు పున: ప్రారంభం కావడంతో పూజారీ కుమారస్వామిచే అక్షరాభ్యాసం చేయించారు.

పరిగిలో..

పరిగి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు విద్యతో పాటు, పౌష్టికాహారం అందజేస్తున్నామని సీడీపీఓ మెహరున్నీసాబేగం సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని రాపోల్ గ్రామంలో అమ్మమాట అంగన్‌వాడీ బాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తున్నామన్నారు. ప్రతిఒక్కరూ దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఉజ్వల, అంగన్‌వాడీ కార్యకర్త బాలమ్మ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- బీరువాలోని విలువైన వస్తువుల అపహరణ
- కేసు నమోదు చేసిన పోలీసులు



ప్రభులింగం ఇంట్లో తెరిచిన బీరువా లాకర్

తాండూరు రూరల్: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన సంఘటన పెద్దేముల్ మండలం కందనెల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రశాంత్ వర్ధన్ కథనం ప్రకారం.. కందనెల్లి గ్రామానికి చెందిన జంగం ప్రభులింగం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి పని నిమిత్తం వెళ్లాడు. గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి బీరువాలోని విలువైన వస్తువులను అపహరించారు. శుక్రవారం ఇంటికి వచ్చి చూసేసరికి బీరువాలోని సామాగ్రి కనిపించకుండా పోయాయి. సుమారు రూ.93వేల విలువైన వస్తువులు దొంగతనం జరిగిందని బాధితుడు ఫిర్యాదు చేశాడు. పోలీసులు క్లూజ్‌టీంతో వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ ప్రశాంత్ వర్ధన్ తెలిపారు.

రైలు ఢీకొని యువకుడి దుర్మరణం

కొత్తూరు: రైలు ఢీకొని ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ మల్లేశ్ తెలిపిన ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన రింకూసింగ్(22) పట్టణంలోని అద్దెకు ఉంటూ ఓ పరిశ్రమంలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఉద యం పట్టాల పక్క నుంచి నడుచుకుంటూ వెళ్తున్న ఆయ న్ను రైల్వే వంతెన సమీపంలో మహబూబ్‌నగర్ నుంచి కాచిగూడ వెళ్తున్న డెమో రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన రింకూసింగ్ అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. పోస్టుమార్టం ని మిత్తం మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. లోకోపైలెట్ చిరంజీవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

గిరిజన విద్యార్థులకు డిగ్రీలో నేరుగా అడ్మిషన్లు

షాద్‌నగర్ రూరల్: పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో నేరుగా అడ్మిషన్లు పొందాలని ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దోస్త్ ఐడీతో ఆఫ్‌లైన్ ప్రక్రియ ద్వారా ప్రవేశం తీసుకోవచ్చని సూచించారు. దోస్త్ ఐడీతో పాటుగా అన్ని సర్టిఫికెట్లతో నేరుగా కళాశాలలో సంప్రదించాలని కోరారు. మీసేవలో, ఆన్‌లైన్ సెంటర్లలో ఎలాంటి ఫీజు చెల్లించవద్దని, కళాశాలలోనే రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. డిగ్రీ ప్రథమ సంవత్సరంలో బీజెడ్‌సీ, సీఎంజెడ్సీ, బీఏ, బీకాం, ఎంపీసీ, ఎంపీసీఎస్, ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం గిరిజన విద్యార్థినులకు మాత్రమే సీట్లు ఉన్నాయని వివరించారు. వివరాలకు 6305051490, 9885003390, 9703441345 ఫోన్‌నంబర్లను సంప్రదించాలని ఆమె కోరారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

- ఎంపీడీఓ ఆఫీసులో కదలని పనులు
- ఇబ్బందుల్లో దౌల్తాబాద్ మండల ప్రజలు



దౌల్తాబాద్ మండల పరిషత్ కార్యాలయం

దౌల్తాబాద్: మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బంది కొరత ఇటు ప్రజలతో పాటు అటు అధికారులనూ వేధిస్తోంది. సరిపడా సిబ్బంది లేకపోవడంతో సకాలంలో పనులు జరగక జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలో 33 పంచాయతీలు ఉండగా ఆయా గ్రామాల ప్రజలు నిత్యం తమ సమస్యలపై ఎంపీడీఓ ఆఫీసుకు వస్తున్నారు. ఇక్కడ ఎంపీఓ, సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్, టైపిస్ట్, అటెండర్ తదితర పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో కార్యాలయ నిర్వహణ కష్టంగా మారిందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి, సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

మంత్రి శ్రీహరికి శుభాకాంక్షల వెల్లువ



ఆమనగల్లు: మంత్రి శ్రీహరికి శ్రీవారి ప్రసాదం అందజేస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ గీత



షాద్‌నగర్: వాకిటి శ్రీహరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి

ఆమనగల్లు: రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల శాఖలు, క్రీడల, యువజన సర్వీసులు శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని ఆమనగల్లు ఏఎంసీ చైర్‌పర్సన్ యాట గీత మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం నగరంలోని ఆయన కార్యాలయంలో కలిసి గీత తిరుమల శ్రీవారి ప్రసాదం అందజేసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆమె వెంట ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, యూత్ కాంగ్రెస్ కల్వకుర్తి ఉపాధ్యక్షుడు షాబుద్దీన్ తదితరులు ఉన్నారు.

'వాకిటి'కి 'చౌలపల్లి' సన్మానం

షాద్‌నగర్: రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల శాఖలు, క్రీడల, యువజన సర్వీసులు శాఖ మంత్రిగా నియమితులైన వాకిటి శ్రీహరిని శుక్రవారం షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. నగరంలోని మంత్రి కార్యాలయానికి వెళ్లిన ఆయన శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. చౌలపల్లి వెంట నాయకులు శివశంకర్‌గౌడ్, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే బడుగుల సంక్షేమం



షాబాద్: శ్రీహరికి శుభాకాంక్షలు తెలుపుతున్న మధుసూదన్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు

షాబాద్: కాంగ్రెస్‌తోనే బడుగుల సంక్షేమం సాధ్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మంత్రి వాకిటి శ్రీహరిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యంలో సంక్షేమం, అభివృద్ధి, ప్రగతి కొనసాగుతుందన్నారు. ఆయన వెంట గుడిమల్కాపూర్ ఏఎంసీ చైర్మన్ చంద్రశేఖర్, సీనియర్ నాయకుడు రాజుగౌడ్ ఉన్నారు.

అసంపూర్తి రోడ్డు.. అవస్థలు చూడు



బాగాయిపల్లి సమీపంలో రోడ్డు అంచు నుంచి వెళ్తున్న బైక్



నాగసముందర్ గేటు సమీపంలో చిత్తడిగా మారిన రహదారి

- భారీ వర్షానికి గుంతల్లో నిలిచిన నీరు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న వాహనదారులు

యాలాల: మండలంలోని బాగాయిపల్లి నుంచి కమాల్‌పూర్ వరకు ప్రారంభించిన రోడ్డు వెడల్పు పనులు అసంపూర్తిగా వదిలేయడంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గురువారం ఉదయం, సాయంత్రం వేళ భారీ వర్షం పడటంతో ఈ మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తాండూరు నుంచి బాగాయిపల్లి, ముద్దాయిపేట మీదుగా హైదరాబాద్, షాద్‌నగర్, పరిగి లాంటి ప్రాంతాలకు వెళ్లేందుకు వీలుంది. దీంతో ఈ మార్గంలో ప్రతి రోజు భారీ వాహనాలతో పాటు ద్విచక్రవాహనదారులు ప్రతి రోజు వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు చేస్తుంటారు. అయితే ఆరు నెలల క్రితం రోడ్డు వెడల్పు పనులను ప్రారంభించిన కాంట్రాక్టరు తారు రోడ్డును పూర్తిగా తవ్వి కంకర, డస్ట్‌తో పనులను ప్రారంభించారు. అయితే అసంపూర్తిగా రోడ్డు వదిలేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షానికి గుంతల్లో నీరు నిలిచి చెరువును తలపించింది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ దారి విషయంలో ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.